ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

మహబూబాబాద్

సోమవారం 29 ఏప్రిల్ 2024



హనుమకొండ చౌరస్తాలో జరిగిన రోడ్‌షోకు హాజరైన బీఆర్ఎస్ కార్యకర్తలు, జనం

బీఆర్ఎస్ పాలనలోనే వరంగల్ అభివృద్ధి

- 24 అంతస్తుల సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి, మెగా టెక్స్‌టైల్ పార్కు, ఐదు మెడికల్ కళాశాలలు నిర్మించాం..
- 4 నెలల కాంగ్రెస్ పాలనలో అన్నీ సమస్యలే..
- కడియం రాజకీయ జీవితం సమాధి కాబోతుంది..
- 3 నెలల్లో స్టేషన్ ఘన్‌పూర్‌లో ఉప ఎన్నిక
- వరంగల్ గడ్డపై గులాబీ జెండా ఎగరాలి..
- బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్
- హనుమకొండలో రోడ్ షో

రాంనగర్, ఏప్రిల్ 28: బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో వరంగల్ నగరం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందని బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నారు. అభివృద్ధికి ప్రతీకగా వరంగల్ నగరంలో 24 అంతస్తుల సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి, హెల్త్ యూనివర్సిటీ, మెగా టెక్స్‌టైల్ పార్కు, ఐదు మెడికల్ కళాశాలలు నిలుస్తాయని తెలిపారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం హనుమకొండ కేసీఆర్ రోడ్ షో నిర్వహించారు. హనుమకొండ చౌరస్తాలో నిర్వహించిన రోడ్‌షోలో కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు మాట్లాడారు.

తెలంగాణ చరిత్రకు, వైభవానికి ప్రతీక వరంగల్ అని, వరంగల్ ఉద్యమ స్ఫూర్తితోనే తెలంగాణ రాష్ట్రాన్ని సాధించామని తెలిపారు. సమైక్య రాష్ట్రంలో వరంగల్ నగరం వెనుకబడిందన్నారు. బీఆర్ఎస్ 10 ఏళ్ల పాలనలో కరువు అనేదే లేదన్నారు. నాలుగు మాసాల కాంగ్రెస్ పాలనలో పంటలు ఎండుతున్నాయని, కరెంటు సమస్య, నీటి సమస్య ఏర్పడ్డాయని కేసీఆర్ పేర్కొన్నారు. అధికారం కోసం కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు నెరవేర్చలేదని ఆయన ధ్వజమెత్తారు. రైతుబంధు వచ్చిందా? ప్రతీ మహిళకు రూ.2500 ఇచ్చారా? రూ.2లక్షల రుణమాఫీ అయిందా? ధాన్యానికి రూ.500 బోనస్ ఇచ్చారా అంటూ హాజరైన వారితో చెప్పించారు. బీఆర్ఎస్ పాలనలో భూముల ధరలు పెరిగాయని, ప్రస్తుతం రియల్ దందా బంద్ అయిందని కేసీఆర్ అన్నారు. వందల మంది రోడ్లపై పడ్డారని ఆయన స్పష్టం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం టీఎస్ బిపాస్ తీసుకువచ్చి 21రోజుల్లో



బస్సులో నుంచి అభివాదం చేస్తున్న కేసీఆర్

మిగతా 7వ పేజీలో..

నేడు మానుకోటలో బీజేపీ జనసభ

- హాజరు కానున్న జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా
- ఏర్పాట్లను పరిశీలించిన పార్టీ జాతీయ కార్యవర్గసభ్యుడు గరికపాటి
- మహబూబాబాద్ లోక్‌సభ సెగ్మెంట్‌పై 'కమలం' నజర్





ఎన్టీఆర్ స్టేడియంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న బీజేపీ నేతలు

మహబూబాబాద్, ఏప్రిల్28 (ఆంధ్రజ్యోతి) : మానుకోట జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ స్టేడియంలో బీజేపీ అభ్యర్థి అజ్మీరా సీతారాంనాయక్ గెలుపును కాంక్షిస్తూ.. సోమవారం జనసభ పేరిట భారీ బహిరంగ సభను నిర్వహిస్తున్నారు. ఈ సభకు భారతీయ జనతా పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా హాజరుకానున్నారు. ఇందుకు పార్టీ శ్రేణులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ముఖ్యఅతిథి ప్రసంగించే వేదికతో పాటు 25 వేలమంది కూర్చునేలా ఎన్టీఆర్ స్టేడియాన్ని సిద్ధం చేశారు. ఎండవేడిమి తగలకుండా షామియానాలు వేసి 50 కూలర్లను ఏర్పాటు చేశారు. సభకు వచ్చిన ప్రజలు ఇబ్బందులు పడకుండా 50 వేల వాటర్‌ప్యాకెట్లు, 30 వేల మజ్జిగ పాకెట్లను సిద్ధం చేశారు. నేడు జగత్‌ప్రకాష్ (జేపీ) నడ్డా న్యూఢిల్లీ నుంచి ఉదయం 9 గంటలకు ప్రత్యేక హెలికాప్టర్‌లో బయలు దేరి 11.10 గంటలకు హైదరాబాద్ బేగంపేట ఎయిర్ పోర్టుకు చేరుకుంటారు. అక్కడి నుంచి 12.30 గంటలకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రానికి చేరుకుని ఖమ్మం పార్లమెంటరీ నియోజకవర్గ పబ్లిక్ మీటింగ్‌లో పాల్గొంటారు. మధ్యాహ్నభోజనం అనంతరం హెలిప్యాడ్ ద్వారా 2.40 గంటలకు మహబూబాబాద్ జిల్లా కేంద్రం శివారు తాళ్ల పూసపల్లి రోడ్‌లోని హెలిప్యాడ్ వద్ద దిగుతారు. అక్కడి నుంచి ఎన్టీఆర్ స్టేడియంకు ర్యాలీగా వచ్చి, బహిరంగ సభలో ప్రసంగించనున్నారు. తిరిగి 4.10 గంటలకు హైదరాబాద్‌కు బయలు దేరి వెళ్తారు.

మానుకోటపై ప్రత్యేక దృష్టి : మాజీ ఎంపీ గరికపాటి

గిరిజన రిజర్వుడ్ మహబూబాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గంలో విజయం సాధించేందుకు పార్టీ అధినాయకత్వం ప్రత్యేక దృష్టి సారిం చిందని బీజేపీ జాతీయ కార్యవర్గసభ్యుడు, మాజీ ఎంపీ గరికపాటి రాం మోహన్‌రావు తెలిపారు. మానుకోట జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ స్టేడియంలో బహిరంగసభ ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోని ఖమ్మం, మహబూబాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గ కేంద్రాల్లో ప్రధాని మోదీ, హోంశాఖ మంత్రి అమిత్‌షా ప్రచారానికి వచ్చే అవకాశం ఉందని చెప్పారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశామని పెద్దసంఖ్యలో తరలివచ్చి బహిరంగ సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

బీజేపీ ఎంపీ అభ్యర్థి అజ్మీర సీతారాంనాయక్ మాట్లాడుతూ కాంగ్రెస్, బీఆర్ఎస్ ఎన్నికుట్రలు చేసిన బీజేపీ గెలుపు ఆపలేరని చెప్పారు. మూడోసారి దేశప్రధానిగా మోదీ కావడం ఖాయమని స్పష్టం చేశారు. మహబూబాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గంలోని చారిత్రాత్మక రామప్ప దేవాలయానికి యూనెస్కో గుర్తింపు తీసుకువచ్చానని, హైదరాబాద్ నుంచి కొత్తగూడెం వరకు 230 కిలోమీటర్ల జాతీయ రహదారి నిర్మాణానికి కృషి చేశానని చెప్పారు. ములుగు జిల్లాలో గిరిజన యూనివర్సిటీ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో పాస్‌పోర్టు కేంద్రాన్ని ఏర్పాటు చేశానని వివరించారు. ఇండియా కూటమి తరఫున ప్రధాని అభ్యర్థి ఎవరో చెప్పాలని డిమాండ్ చేశారు. బీజేపీ అధికారంలోకి వస్తే రిజర్వేషన్లు తీసేస్తుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడడం హాస్యాస్పదం అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు యలమంచిలి వెంకటేశ్వర్‌రావు, కిసాన్‌మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి, వెంకటనారాయణరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, క్యాచువల్ శ్యాంసుందర్‌శర్మ, ఆకుల శ్రీనివాస్, సింగారపు సతీష్, పసుపులేటి నవీన్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఫ్యాన్ రెక్కలు తగిలి.. ఇంటర్ విద్యార్థి దుర్మరణం

- దంతాలపల్లి మండలంలో ఘటన



భూక్య ఈశ్వర్ (ఫైల్)

దంతాలపల్లి, ఏప్రిల్ 28 : వరి తుర్పాల పట్టే ఫ్యాన్ రెక్కలు తగిలి ఓ ఇంటర్మీడియట్ విద్యార్థి మృతి చెందిన ఘటన మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లి మండలం తూర్పుతండాలో చోటు చేసుకుంది. ఎస్సై కరుణాకర్ కథనం ప్రకారం. మేఘ్యాతండాకు చెందిన భూక్య ఈశ్వర్ (18) ఆదివారం తెల్లవారు జామున రామవరం శివారులో ఓ రైతుకు వరి తుర్పాల్ పట్టేందుకు వెళ్లాడు. ఈ క్రమంలో వరి తుర్పాల్ ఫ్యాన్‌ను పక్కకు పెట్టే క్రమంలో స్టార్టర్ ఆన్ కావడంతో ఫ్యాన్ రెక్కలు ప్రమాదశాత్తు ఈశ్వర్ తలకు తగలడంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. ఈశ్వర్ ఇంటర్ ప్రథమ సంవత్సరం మహబూబాబాద్‌లోని ప్రభుత్వ కళాశాలలో చదువుతున్నాడు. మృతుడి తండ్రి వెంకన్న, తల్లి పోటమ్మ, సోదరుడు, సోదరి ఉన్నారు. కాగా, తండ్రి వెంకన్న ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని శవపంచనామా నిర్వహించి పోస్టుమార్టానికి మహబూబాబాద్ ఏరియా ఆస్పతికి తరలించారు. ఈశ్వర్ మృతితో మేఘ్యాతండాలో విషాదఛాయలు అలుముకున్నాయి. వారంలోనే ఈమేగ్యాతండాలో ఇద్దరు యువకులు వివిధ సంఘటనలో మృతి చెందడంతో ప్రజలు భయందోళనలో ఉన్నారు.

మానుకోట మార్కెట్ వారానికి మూడ్రోజులే

- తీవ్రఎండలు, కూలీల రాక కాంటాల ఆలస్యం

మహబూబాబాద్ అగ్రికల్చర్, ఏప్రిల్ 28 : ఎండల తీవ్రతతో కూలీలు బస్తాలను నింపడం ఆలస్యమవుతోందని, కాంటాలు సరిగా సాగకపోవడంతో వారంలో మూడ్రోజులే మహబూబాబాద్ వ్యవసాయ మార్కెట్ నడుస్తుందని మార్కెట్ కార్యదర్శి శంషీర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతీ వారంలో సోమ, బుధ, శుక్రవారాల్లో మాత్రమే మార్కెట్‌లో క్రయవిక్రయాలు కొనసాగుతాయన్నారు. మంగళ, గురు, శని, ఆదివారాల్లో మార్కెట్‌లో క్రయవిక్రయలు జరుగవని వెల్లడించారు. రైతులు గమనించి, తమ ఉత్పత్తులను యార్డుకు తీసుకురావొద్దని, రైతులతో పాటు వ్యాపారులు, హమాలీలు, దడువాయిలు, కూలీలు గమనించాలని కోరారు.

మే 1న మార్కెట్ సెలవు..

కార్మిక దినోత్సవం సందర్భంగా బుధవారం మేడే సందర్భంగా మహబూబాబాద్ మార్కెట్‌కు సెలవుదినంగా ప్రకటించారు. రైతులు గమనించి, ఆ రోజు మార్కెట్ సరుకులు తీసుకువచ్చి, ఇబ్బంది పడవద్దని శంషీర్ వివరించారు.

పార్లమెంట్ ఎన్నికల్లో మహిళలు సత్తా చాటాలి

పాలకుర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి



పెద్దవంగరలో మాట్లాడుతున్న యశస్విని రెడ్డి

తొర్రూరు, ఏప్రిల్ 28 : వరంగల్ పార్లమెంట్ ఎన్నికల్లో నియోజకవర్గంలోని మహిళలు అత్యధిక ఓటింగ్ శాతం నమోదయ్యే విధంగా మహిళా కార్యకర్తలు కృషి చేయాలని పాలకుర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం తొర్రూరులోని క్యాంపు కార్యాలయంలో మహిళా కార్యకర్తలతో ప్రత్యేక సమావేశం నిర్వహించి, ఆమె మాట్లాడారు. కడియం కావ్య గెలుపు కోసం కార్యకర్తలు కష్టపడి పనిచేయాలని సూచించారు. అనంతరం నియోజకవర్గంలోని అన్ని మండలాల సోషల్ మీడియా కో-ఆర్డినేటర్‌లతో సమీక్ష సమావేశం నిర్వహించివరంగల్ పార్లమెంట్ ఎన్నికల్లో యువ ఓటర్లను ఆకర్షించడం, కడియం కావ్య గెలుపు కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. నియోజకవర్గంలోని ఆయా మండలాల మహిళా కార్యకర్తలు పింగిలి ఉష, శారద, యశోద, రమ, మహిళా కార్యకర్తలు, సోషల్ మీడియా కో-ఆర్డినేటర్‌లు పాల్గొన్నారు.

పార్టీ గెలుపు కోసం కష్టపడి పనిచేయాలి

పెద్దవంగర : రాబోయే వరంగల్ పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కడియం కావ్య గెలుపు కోసం కార్యకర్తలు కష్టపడి పనిచేయాలని నియోజకవర్గ ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి అన్నారు. పెద్దవంగర మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు, ముఖ్యనాయకులతో సమీక్ష చేపట్టి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత అసెంబ్లీ ఎన్నికల్లో పెద్దవంగర మండలం నుంచి పార్టీకి 4 వేల మెజార్టీ వచ్చిందని, పార్లమెంట్ ఎన్నికల్లో కడియం కావ్యకు 10 వేల మెజార్టీ అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముద్దసాని సురేష్, నాయకులు నిరంజన్ రెడ్డి, నెహ్రూనాయక్, ప్రవీణ్‌రావు, మురళి, సైదులు, హరికృష్ణ, సమ్మయ్య, వివిధ గ్రామాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

మానుకోట ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్

గూడూరు, ఏప్రిల్ 28 : పేదల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని మహబూబాబాద్ ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ అన్నారు. గూడూరు మండలం అప్పరాజుపల్లిలో బీఆర్ఎస్ పార్టీ నుంచి పలువురు కాంగ్రెస్‌లో చేరారు. వారికి ఆదివారం కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఎంపీ అభ్యర్థి పోరిక బలరాంనాయక్ గెలుపు కోరుతూ.. ఇంటింటా ప్రచారం నిర్వహించారు. బొద్దుగొండ, కోల్లాపురం గ్రామాల్లో కాంగ్రెస్ జిల్లా నాయకులు భరత్‌చందర్‌రెడ్డి, మండల అధ్యక్షులు చిట్టి వెంకటేశ్వర్లు, నాయకులు బోయినపల్లి సతీష్‌రావు ఆధ్వర్యంలో ముమ్మరంగా ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రదీప్‌రెడ్డి, బొల్లికొండ మధు, శ్రీపాల్‌రెడ్డి, ఖాదర్‌హుస్సేన్, కృష్ణ, లక్ష్మయ్య, చంటిస్వామి తదితరులు పాల్గొన్నారు.



అప్పరాజుపల్లిలో కాంగ్రెస్‌పార్టీలో చేరుతున్న వారికి కండువా కప్పుడుతున్న భూక్య మురళీనాయక్

ఆశీర్వదించండి.. అభివృద్ధి చేస్తా

- బీజేపీ ఎంపీ అభ్యర్థి అజ్మీరా సీతారాంనాయక్

మహబూబాబాద్ రూరల్, ఏప్రిల్ 28 : పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనను మరోసారి ఆశీర్వదించి గెలిపిస్తే మానుకోట పార్లమెంట్ నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తానని అజ్మీరా సీతారాంనాయక్ అన్నారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్ నుంచి కూరగాయల మార్కెట్ వరకు ఆదివారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడతూ దేశప్రజలు మోదీని మూడోసారి ప్రధాని చేసేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. తాను ఎంపీగా పనిచేసిన కాలంలో రామప్పకు యునిస్కో గుర్తింపు తీసుకువచ్చానని చెప్పారు. గిరిజన ప్రాంతమైన మానుకోట నియోజకవర్గానికి గిరిజన యూనివర్సిటీ ఏర్పాటుకు కృషి చేసినట్లు చెప్పారు. తనను మరోసారి ఆశీర్వదించి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఆయనవెంట జిల్లా మాజీ అధ్యక్షుడు వద్దిరాజు రాంచందర్‌రావు, యాప సీతయ్య, నాయకులు మోసంగి మురళి, బోయినపల్లి లక్ష్మణ్‌రావు, శశివర్ధన్‌రెడ్డి, అకుల శ్రీనివాస్, ఇందుభారతి, సిరికొండ సంపత్, పల్లె సందీప్, రాంబాబు, బాలునాయక్, మల్లం యశ్వంత్, చుక్కల నరేష్, రేష్మా, ప్రేమ్‌రాయుడు పాల్గొన్నారు.

నేడు భగీరథ నీటి సరఫరాలో అంతరాయం

మహబూబాబాద్ అగ్రికల్చర్, ఏప్రిల్ 28 : మిషన్ భగీరథ మరిపెడ వాటర్ ట్రీట్‌మెంట్‌ప్లాంట్ ఉన్న ఉమ్మడి జిల్లా పరిధిలో పలు గ్రామాలకు సోమవారం మంచినీటి సరఫరా నిలిచిపోతుందని మహబూబాబాద్ జిల్లా మిషన్ భగీరథ గ్రిడ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సురేందర్ తెలిపారు. మరిపెడ వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌కు నీటిని అందించే ఖమ్మం జిల్లా పాలేరు రిజర్వాయర్ వద్ద ప్రధాన పైపులైన్‌లకు సంబంధించిన మరమ్మతు పనులు నెలకొన్న నేపథ్యంలో నీటి సరఫరా నిలిచిపోతుందని చెప్పారు. మహబూబాబాద్ జిల్లాలోని అన్నిగ్రామాలతో పాటు వరంగల్ జిల్లా పరిధిలోని రాయపర్తి, నర్సంపేట డివిజన్‌లోని అన్ని గ్రామాలకు ఆవాసాలకు సోమవారం మంచినీటి సరఫరా నిలిచిపోతుందన్నారు. అన్ని గ్రామపంచాయతీల కార్యదర్శులుప్రత్యేక అధికారులు ఈ విషయాన్నిపరిగణలోకి తీసుకుని స్థానికంగా మంచి నీటి సరఫరాకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ అసౌకర్యానికి ప్రజలు సహకరించాలని కోరారు.

ప్రశాంతంగా ఎంజేపీ బీసీ గురుకుల ఇంటర్, డిగ్రీ ప్రవేశ పరీక్ష



మహబూబాబాద్ మహాత్మజ్యోతిరావుపూలే గురుకుల పాఠశాలలో ప్రవేశ పరీక్ష రాసి బయటకు వస్తున్న విద్యార్థులు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఏప్రిల్28 : జిల్లా కేంద్రంలో ఆదివారం నిర్వహించిన మహాత్మాజ్యోతిరావు పూలే బీసీ గురుకులం ఇంటర్, డిగ్రీ కళాశాలల ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా జరిగినట్లు మహబూబాబాద్ జిల్లా కన్వీనర్ జి.అనిత తెలిపారు. జిల్లా కేంద్రంలో ఇంటర్, డిగ్రీ ప్రవేశాలు పొందేందుకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఆరు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసి, ఎగ్జామ్ నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 వరకు నిర్వహించిన ఇంటర్ పరీక్షకు 963 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కానుండగా.. 855 (88.88 శాతం) మంది హాజరయ్యారన్నారు. డిగ్రీలో ప్రవేశాల కోసం నిర్వహించిన ఎగ్జామ్‌కు 476 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కానుండగా 416 (87.82 శాతం) మంది హాజరయ్యారు.

మే డేను ఘనంగా నిర్వహించాలి

సీపీఐ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి



సమావేశంలో మాట్లాడుతున్న విజయసారథి

మహబూబాబాద్ టౌన్, ఏప్రిల్ 28 : మే 1న ప్రపంచ కార్మికుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి పిలుపునిచ్చారు. మహబూబాబాద్ వీర భవన్‌లో జిల్లా కౌన్సిల్ సమావేశాన్ని నల్లు సుధాకర్‌రెడ్డి అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీపీఐ బలపర్చిన మానుకోట పార్లమెంటరీ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి బలరాంనాయక్ గారిని భారీ మెజార్టీతో గెలిపించేందుకు మే 3న జిల్లా కేంద్రంలో పార్లమెంటరీ పరిధిలోని 5 వేలమంది సీపీఐ శ్రేణులతో ఎన్నికల సభను నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఈ సభకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, అభ్యర్థి బలరాంనాయక్ హాజరవుతున్నారని చెప్పారు. దేశంలో పదేళ్లు అధికారంలో ఉన్న బీజేపీ మతోన్మాదాన్ని పోషించగా రాష్ట్రంలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ రూ.లక్షల కోట్ల అవినీతికి పాల్పడిందని పార్లమెంట్ ఎన్నికల్లో ఆ రెండు పార్టీలకు బుద్ధి చెప్పాలన్నారు.

అసెంబ్లీ ఎన్నికల్లో మాజీ సీఎం కేసీఆర్‌కు గుణపాఠం చెప్పిన విధంగా, పార్లమెంట్ ఎన్నికల్లో తమ ఓటుద్వారా ప్రధాని మోదీని గద్దె దించాలని విజ్ఞప్తి చేశారు.

ఈ సమావేశంలో అజయ్‌సారథిరెడ్డి, కట్టెబోయిన శ్రీనివాస్, పెరుగుకుమార్, సాంబలక్ష్మి, వెంకన్న, నాగేశ్వర్‌రావు, శేఖర్, రాజన్న, శ్రావణ్, వీరన్న, రవీందర్, లింగ్యానాయక్, పద్మ, సత్యనారాయణ పాల్గొన్నారు.

ఆయనకు 80.. ఆమెకు 70

- మనవళ్లు, మానువరాళ్ల కోరికతో వృద్ధుల వివాహం
- మనుమడి పుట్టినరోజు సందర్భంగా తండాలో సందడి



వివాహం చేసుకుంటున్న వృద్ధులు

నెల్లికుదురు, ఏప్రిల్ 28 : ఆయనకు ఎనభై ఏళ్లు.. ఆమెకు డెబ్బై.. అయితేనేం.. ఈ వృద్ధాప్యంలో నవదంపతులుగా బోసి.. బోసి.. నవ్వులు పండిస్తూ.. వివాహ వేడుకను జరిపించుకున్నారు. మనవళ్లు, మనవరాళ్ల ఆకాంక్ష మేరకు వారి మనవడైన యాకూబ్ పుట్టిన రోజు సందర్భంగా తాత-నానమ్మల పెళ్లి జరిపించాలన్న సంకల్పాన్ని ఆచరణ రూపంలో పెట్టారు. నెల్లికుదురు మండలం వస్రాంతండాలో ఆదివారం చోటు చేసుకున్న ఈ అరుదైన వివాహ వేడుక వివరాలు తండావాసుల కథనం ప్రకారం ఇలా ఉన్నాయి. వస్రాంతండాకు చెందిన గుగులోత్ సమీడానాయక్ (80) లాలి (75) గత 60 ఏళ్ల నుంచి వివాహం చేసుకోకుండానే ఒకరికొకరు ఇష్టపడి సహజీవనం కొనసాగిస్తున్నారు. వీరికి నలుగురు కుమారులు, కూతురు సంతానం. వారి పిల్లలు ఐదుగురు మనమళ్లు, ఐదుగురు మనమరాళ్లు ఉన్నారు. ఆ వృద్ధులకు వివాహం జరుగలేదన్న విషయాన్ని గ్రహించిన మనువళ్లు, మనుమరాళ్లు ఆ తంతును జరిపించాలని సంకల్పించారు. ఈ విషయాన్ని తండా పెద్దలకు చెప్పి తాత-నానమ్మల అనుమతి తీసుకుని ఆదివారం తమలో ఒకరైన మనువడి వరుస యాకూబ్ పుట్టినరోజు సందర్భంగా వివాహాన్ని పెద్దల సమక్షంలో ఘనంగా జరిపించారు.

స్వయాన పురోహితుడు హాజరై వివాహతంతును సంప్రదాయ ప్రకారం నిర్వహించారు. బోసి నవ్వులతో నల్లకళ్ల అద్దాలు పెట్టుకున్న తాత.. నానమ్మతో కలిసిసందడి చేశారు. అక్షింతలు పోటీపడి పోసుకున్నారు. మొత్తానికి తండాలో వృద్ధుల పెళ్లి సండే సందడిగా మారింది.

మానసిక వికలాంగుడి అదృశ్యం



పవన్

మడికొండ, ఏప్రిల్ 28: ఈ నెల 24న మడికొండలో జరిగిన కాంగ్రెస్ జన జాతర బహిరంగ సభలో మానసిక వికలాంగ యువకుడు తప్పిపోయాడు. ఆదివారం మడికొండ ఇన్‌స్పెక్టర్ డి.ప్రతాప్ తెలిపిన వివరాల మేరకు.. భూపాలపల్లి జిల్లా రేగొండ మండలం రంగయ్యపల్లి గ్రామానికి చెందిన బొచ్చు పవన్ వారి గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులతో కలిసి బస్సులో జన జాతర సభకు హాజరయ్యాడు. తిరిగి వెళ్లే క్రమంలో కనిపించకుండా పోయాడు. బంధువులు, తెలిసిన వారందరిని విచారించినా అతడి ఆచూకీ తెలియలేదు. పవన్ మానసిక వికలాంగుడైనందున అడ్రస్ క్లియర్‌గా చెప్పలేడన్నారు. ఆచూకీ తెలిసిన వారు 87126 85123, 87126 85248, 87126 85009 నెంబర్లకు తెలియజేయాలని ఇన్‌స్పెక్టర్ కోరారు.

బీఆర్ఎస్ పాలనలో వరంగల్ అభివృద్ధి

(5వ పేజీ తరువాయి)

నిర్మాణాలకు అనుమతులు ఇచ్చామని కేసీఆర్ తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం స్కేర్‌ఫీట్ చొప్పున లంచం ఇవ్వాలని కండీషన్ పెట్టి ఇబ్బందులు పెడుతోందని ఆరోపించారు. ఇక బీజేపీ ఎజెండాలో ప్రజల కష్టసుఖాలు ఉండవని కేసీఆర్ అన్నారు. కాజీపేట కోచ్ ఫ్యాక్టరీని ప్రధాని మోదీ గుజరాత్‌కు తరలించుకు వెళ్లాడని కేసీఆర్ విమర్శించారు. గోదావరి నదిని కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలకు తీసుకువెళ్లాలని మోదీ చూస్తుంటే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎందుకు స్పందించడం లేదని ఆయన ప్రశ్నించారు. రేవంత్ స్పందించకపోవడం వెనుక మతలబు తెలియడం లేదన్నారు. మోదీకి 200 సీట్లు దాటవని కేసీఆర్ అన్నారు. బీఆర్ఎస్ 12 ఎంపీ సానాలు గెలుచుకుంటే కేంద్రంలో కీలకంగా మారి సమస్యలు పరిష్కరించుకునే అవకాశం ఉంటుందన్నారు. చైతన్యమైన వరంగల్ గడ్డపై గులాబీ జెండా ఎగురాలని ఆయన పిలుపిచ్చారు. వరంగల్ అభ్యర్థి సుధీర్‌కుమార్‌ను గెలిపించాలని ఆయన కోరారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రతీ ప్రసంగంలో 'కేసీఆర్ గుడ్లు పీకి గోలీలు ఆడుతా.. పేగులు మెడలకు వేసుకుంటా.. చర్లపల్లి జైలుకు పంపుతా..' అంటున్నాడని.. తాను కేసులకు భయపడేది లేదన్నారు. కేసులకు భయపడితే తెలంగాణ వచ్చేదా? అని ఆయన అన్నారు. కడియం శ్రీహరికి డిప్యూటీ సీఎంతో పాటు ఎన్నో పదవులు ఇచ్చామన్నారు. బీఆర్ఎస్‌కు చేసిన మోసానికి సుప్రీంకోర్టు తీర్పు మేరకు కడియం శ్రీహరి రాజకీయ జీవితం సమాధి కాబోతుందని దుయ్యబట్టారు. మరో మూడు మాసాల్లో స్టేషన్ ఘన్‌పూర్‌లో ఉప ఎన్నిక రాబోతుందన్నారు. ఉప ఎన్నికలో డాక్టర్ రాజయ్య ఎమ్మెల్యే కాబోతున్నాడని కేసీఆర్ తెలిపారు. ఈ సమావేశంలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, వరంగల్ బీఆర్ఎస్ లోక్‌సభ అభ్యర్థి డాక్టర్ సుధీర్ కుమార్, హనుమకొండ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు దాస్యం వినయభాస్కర్, ఎమ్మెల్సీలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మధుసూధనాచారి, శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్, మాజీ ఎమ్మెల్యేలు డాక్టర్ రాజయ్య, గండ్ర వెంకటరమణారెడ్డి, నన్నపునేని నరేందర్, చల్లా ధర్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్‌కు ఘన స్వాగతం

- బతుకమ్మలు, బోనాలతో అలరించిన బీఆర్ఎస్ మహిళా కార్యకర్తలు
- కేసీఆర్ రోడ్ షో కారణంగా హనుమకొండలో ట్రాఫిక్ జామ్



హనుమకొండ చౌరస్తాలో మాట్లాడుతున్న కేసీఆర్

న్యూశాయంపేట, ఏప్రిల్ 28 : బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి సుధీర్‌కుమార్‌కు మద్దతుగా బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ ఆదివారం రాత్రి హనుమకొండకు వచ్చారు. కేసీఆర్‌కు హంటర్‌రోడ్ లోని బీఆర్ఎస్ నేత కెప్టెన్ లక్ష్మీకాంతరావు ఇంట్లో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, మాజీ స్పీకర్ సిరికొండ మధుసూదనాచారి, మాజీ ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్, తదితర బీఆర్ఎస్ నాయకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం కేసీఆర్ హనుమకొండలోని అంబేద్కర్ జంక్షన్ మీదుగా హనుమకొండ చౌరస్తా వరకు రోడ్‌షో నిర్వహించి చౌరస్తాలో మాట్లాడారు. కేసీఆర్ రోడ్‌షో ఆసాంతం బీఆర్ఎస్ మహిళా కార్యకర్తలు, బోనాలు, బతుకమ్మలతో ర్యాలీగా వచ్చారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ కార్యకర్తలు కేసీఆర్‌ను సీఎం సీఎం అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.

ట్రాఫిక్ జామ్

కేసీఆర్ రోడ్‌షో సందర్భంగా హనుమకొండ అదాలత్ జంక్షన్‌నుంచి పోలీస్ హెడ్‌క్వార్టర్స్, హనుమకొండ చౌరస్తా వరకు భారీగా ట్రాఫిక్‌జామ్ అయింది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ట్రాఫిక్‌ను నియంత్రించడానికి పోలీసులు నానాకష్టాలు పడ్డారు. సుమారు 30నిమిషాల పాటు హనుమకొండ చౌరస్తాలో ట్రాఫిక్ జామ్ కావడంతో కొంతమంది వాహనదారులు అసహనం వ్యక్తం చేశారు.



కేసీఆర్ రోడ్ షోలో కళాకారుల విన్యాసాలు



హనుమకొండ అంబేద్కర్ జంక్షన్ వద్ద రోడ్ షోలో డప్పు వాయిస్తున్న రాజయ్య



అంబేద్కర్ జంక్షన్ వద్ద రోడ్ షోలో కేసీఆర్, బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి సుధీర్‌కుమార్



రోడ్ షోకు భారీగా హాజరైన బీఆర్ఎస్ నేతలు, జనం

రిజర్వేషన్‌లలో దగా చేసిందే కాంగ్రెస్

- ప్రైవేటీకరణకు ఆద్యులు పీవీ, మన్మోహన్‌సింగ్
- మోదీని, బీజేపీని విమర్శించే స్థాయి కడియంకు లేదు..
- మాజీ మేయర్, బీజేపీ రాష్ట్ర నాయకుడు రాజేశ్వర్‌రావు



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మేయర్ రాజేశ్వర్‌రావు

హనుమకొండ టౌన్, ఏప్రిల్ 28: బీజేపీ వస్తే ఎస్సీ, ఎస్టీ, బీసీల రిజర్వేషన్‌లు తీసేస్తారని మాట్లాడుతున్న కడియం శ్రీహరి.. రిజ్వేషన్‌ల విషయంలో దగా చేసిందే కాంగ్రెస్ అన్న విషయం మరవొద్దని మాజీ మేయర్, బీజేపీ రాష్ట్ర నాయకుడు రాజేశ్వర్‌రావు అన్నారు. హంటర్‌రోడ్డులోని బీజేపీ వరంగల్ పార్లమెంట్ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 40 ఏళ్ల రాజకీయ విలువలను పక్కకు పెట్టి బిడ్డ కోసం ప్రజలతో ఛీకొట్టించుకునే పరిస్థితికి కడియం దిగజారారని ఎద్దేవా చేశారు. మోదీ వస్తే ప్రజాస్వామ్యం ఉండదని అసత్యప్రచారాలు చేస్తున్న కడియంకు.. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిందే కాంగ్రెస్ పార్టీ అని తెలియదా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ఎమర్జెన్సీతో చీకటి రోజులు తెస్తే దానికి వ్యతిరేకంగా బీజేపీ పోరాడిందన్నారు. 2004 నుంచి 2010 వరకు ఎస్సీ, ఎస్టీ, బీసీల రిజర్వేషన్‌లు నాలుగుసార్లు తొలగించి మైనారిటీలకు ఇచ్చేందుకు కాంగ్రెస్ లోక్‌సభలో ప్రయత్నించిందని విమర్శించారు. 1991లో ప్రైవేటీకరణకు ఆజ్యం పోసిందే పీవీ, మన్మోహన్ సింగ్ అని, ఆనాడు టీడీపీలో ఉన్న నీవు ప్రైవేటీకరణను సమర్థించిన విషయం మరిచిపోయావని గుర్తుచేశారు.

బీజేపీకి ఎస్సీ, ఎస్టీలపై గౌరవం ఉందని అందుకే పార్టీ జాతీయ అధ్యక్షుడిగా దళితుడిని, రాష్ట్రపతిగా ఎస్టీమహిళను నియమించిందని రాజేశ్వర్‌రావు పేర్కొన్నారు. ఓటు బ్యాంకు రాజకీయాలకు కేరాఫ్ కాంగ్రెస్ పార్టీ అని, మైనారిటీలను బుజ్జగించి ఓట్లు వేయించుకునే తీరు కాంగ్రెస్‌కే చెల్లుతుందన్నారు. వరంగల్ అభివృద్ధి జరగలేదని కడియం మాట్లాడుతున్నాడని, ఉమ్మడి జిల్లాలో ఎక్కువకాలం మంత్రిగా పనిచేసినది ఆయనే కదా.. అప్పుడు ఏం చేశావో ప్రజలుకు చెప్పాలన్నారు. రాష్ట్రంలో 17 లోక్‌సభ సీట్లలో ఒక్క సీటు కూడా గెలవలేని వారు.. వరంగల్‌లో రోడ్డు షోలు చేస్తున్నారని, అలాంటి వారికి ఓటు వేసి వృథా చేసుకోవద్దన్నారు. మోదీని విమర్శించే స్థాయి కడియంకు లేదని, ఏకవచనంతో సంబోధిస్తే బీజేపీ కార్యకర్తల ఆగ్రహానికి గురికాకతప్పదని హెచ్చరించారు.బీజేపీ బలపరిచిన ఆరూరి రమేశ్‌ను గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే వన్నాల శ్రీరాములు, పార్లమెంట్ ప్రభారీ మురళీధర్, బీజేపీ పార్టీ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ, అమరేందర్‌రెడ్డి, నాయకులు సత్యనారాయణ, గొర్రె ఓం ప్రకాశ్, జైపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డబ్బులిస్తేనే సభలకు జనం

- ప్రచారంలోనూ ధన ప్రవాహమే..
- నాయకులకు తడిసిమోపడవుతున్న ఖర్చులు

ఎల్కతుర్తి, ఏప్రిల్ 28: లోక్‌సభ ఎన్నికల్లో గ్రామాల్లో ఇంటింటా ప్రచారానికి సైతం డబ్బులు ఇస్తేనే తిరుగుతున్నారు. ప్రచారం నిర్వహించాలంటే ఆ గ్రామ నాయకుడితో పాటు పలువురు అవసరం. దీంతో మనిషి కింత రేటు నిర్ణయించి డబ్బులు అందజేసి మరి ప్రచారానికి వెంటేసుకు తిరుగుతున్నారు. డబ్బులు ముట్ట చెప్పకుంటే అటువైపు కన్నెత్తి చూడటం లేదు. ఇక పార్టీ అభ్యర్థి ప్రచారానికొస్తే జన సమీకరం కోసం లక్షలు కుమ్మరించాల్సిందే. ఇక భారీ బహిరంగ సభలు, సమావేశాలు, రోడ్డు షోలకు ప్రజలను తరలించడానికి వాహనాలు సమకూర్చడంతో పాటుగా డబ్బు, మద్యం అందజేస్తేనే సభ విజయవంతమవుతోంది.

ప్రచారానికి ఒక్కొక్కరికి రూ.300

అభ్యర్థి తరుపున గ్రామాల్లో ప్రచారం చేయడానికి వ్యక్తులను పోగు చేయాల్సి ఉంటుంది. గ్రామ ముఖ్య నాయకుడితో పాటు ఇంటింటా తిరిగి ప్రచారం చేయడానికి, బొట్టు పెట్టడానికి అభ్యర్థులను ముందుగానే ఎంపిక చేసుకుంటున్నారు. పార్టీ కరపత్రం పట్టుకుని వెంట తిరిగే వారికి ఒక్కొక్కరికి రూ. 300, కాస్త వాక్చాతుర్యం ఉన్న వ్యక్తికి మరో రూ. 200 కలిపి మొత్తం రూ.500 చొప్పున అందజేసి మరి ప్రచారం చేయిస్తున్నారు. ఇక ముఖ్య నాయకుడికి ప్రత్యేక ప్యాకేజీనే.

ఏ సభకు వెళ్లినా అదే జనం

అభ్యర్థులు ప్రజలను ఆకర్షించడానికి పోటా పోటీగా ప్రచారాలు, సభలు, రోడ్డు షోలు నిర్వహిస్తున్నారు. ఒకరిని మించి మరొకరు తమదైన శైలిలో ప్రచారం సాగిస్తున్నారు. డబ్బులు ఇచ్చి జన సమీకరణ చేయడంతో ఏ సభకు, సమావేశానికి వెళ్లిన ఆదే జనం దర్శనమిస్తున్నారు. ఎవరు డబ్బులు ఇచ్చినా వెళ్లుతున్నాము కానీ తమకు అన్ని విధాలుగా ఉపయోగ పడే నాయకుడికి ఎన్నుకునేదుకు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకుంటామని ప్రజలు తెలుపుతున్నారు.

కుల సంఘాలకు ప్రత్యేక ప్యాకేజీలు

అభ్యర్థులు కుల ప్రతిపాదికన ప్రాధాన్యత కల్పిస్తున్నారు. ఆయా కులానికి చెందిన వ్యక్తులను సమావేశ పరిచి వారికి విందులు, ప్రత్యేక ప్యాకేజీలు ప్రకటిస్తున్నారు. తమ కులానికి చెందిన ఓట్లు పక్కదారి పట్టకుండా జాగ్రత్తలు వహించాలని సూచిస్తున్నారు.

నిఘా విభాగంలో లీకు వీరుడు

- రహస్య విచారణలు బహిర్గతం
- దృష్టి సారించని ఉన్నతాధికారులు

వరంగల్ క్రైం, ఏప్రిల్ 28: పోలీసు నిఘా విభాగంలో ఓ లీకు వీరుడున్నట్లు సమాచారం. దశాబ్ద కాలానికి పైగా కమిషనరేట్‌లో విధులు నిర్వహిస్తున్న సదరు అధికారి.. శాఖాపరంగా చేసే రహస్య విచారణలు, సర్వేలు లీకు చేస్తుంటాడనే ప్రచారం ఉంది. పోలీసు శాఖలో అత్యంత ప్రధానమైన నిఘా విభాగంలో విధులు నిర్వహిస్తున్న సదరు అధికారి.. ఎన్నికల బరిలో నిలిచే ప్రధాన పార్టీల అభ్యర్థుల గెలుపోటములపై రహస్యంగా చేసే సర్వే నివేదికలను లీకు చేస్తాడనే ఆరోపణలు ఉన్నాయి. భూ కబ్జాలు ఇతరత్రా నేరాలపై చేసే విచారణలో ఈయన చేతివాటం చూపిస్తాడనే విమర్శలున్నాయి. రహస్య విచారణలను కబ్జాదారులకు లీకు చేసి వారు అప్రమత్తం అయ్యేలా సహకరిస్తాడనే ఆరోపణలున్నాయి.

గత అసెంబ్లీ ఎన్నికల్లో అభ్యర్థుల గెలుపోటములపై నిర్వహించే సర్వేలను ముందే అభ్యర్థులకు చేరవేశాడనే విమర్శలున్నాయి. ఎవరు అధికారంలో ఉంటే వారి పాటపాడే సదరు అధికారి.. నగరంలో పలు నేరాలపై జరిగే విచారణలు, సర్వేలను లీకు చేశాడని సమాచారం. నిఘా విభాగానికి ఏ అధికారి ఇన్‌చార్జిగా వచ్చినా తన బుట్టలో వేసుకుని ఆయన చేసిందే సర్వే, విచారణ అనే చందంగా నడిపిస్తుంటాడని తెలిసింది. ఇతడిపై ఉన్నతాధికారులకు పలు ఫిర్యాదులు వెళ్లినట్లు సమాచారం. ఈయన చేసిన తప్పుడు నివేదికలు, సర్వేల లీకులకు సంబంధించి ఆధారాలతో ఫిర్యాదులు ఉన్నతాధికారులకు చేరినట్లు తెలిసింది. మొత్తంగా సదరు లీకు వీరుడి వ్యవహారంపై పోలీసు ఉన్నతాధికారులు దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది. లేదంటే సదరు అధికారి ఇచ్చే లీకులు శాఖ అధికారుల మెడకు చుట్టుకునే అవకాశం లేకపోలేదు.

ఏనుమాములలో గన్ మిస్‌ఫైర్

- కానిస్టేబుల్‌కు గాయాలు... ఎంజీఎంలో చికిత్స..



ఎంజీఎంలో చికిత్స పొందుతున్న కానిస్టేబుల్ రాజేష్

వరంగల్ సిటీ, ఏప్రిల్ 28: గన్‌ను శుభ్రం చేస్తుండగా మిస్‌ఫైర్ అయి కానిస్టేబుల్ గాయపడిన ఘటన ఆదివారం వరంగల్ ఏనుమాముల మార్కెట్‌లో చోటుచేసుకుంది. ఏనుమాముల మార్కెట్ ఎస్ఐ శ్రీకాంత్ కథనం ప్రకారం.. లోక్‌సభ ఎన్నికలను పురస్కరించుకుని వరంగల్ ఏనుమాముల మార్కెట్‌లో ఈవీఎంలను భద్రపరిచారు. 12వ నంబర్ గోదాం వద్ద విధులు నిర్వహిస్తున్న ఏఆర్ కానిస్టేబుల్ ఎ.రాజేష్(32) గన్ శుభ్రపరుస్తున్న క్రమంలో ఒక్కసారిగా మిస్‌ఫైర్ అయింది. దీంతో బుల్లెట్ కానిస్టేబుల్ కాలిమడిమలోకి దూసుకుపోయింది. అక్కడే విధులు నిర్వహిస్తున్న తోటి కానిస్టేబుళ్లు వెంటనే చికిత్స నిమిత్తం ఎంజీఎంకు తరలించారు. ఎస్ఐ శ్రీకాంత్ దగ్గరే ఉండి చూసుకున్నారు. అతడికి ఎలాంటి ప్రాణహాని ఏమిలేదని వైద్యులు తెలిపారు. కాగా, రాజేష్ 21 రోజులుగా ఏనుమాముల మార్కెట్లోని ఈవీఎం స్ట్రాంగ్ రూంల వద్ద విధులు నిర్వహిస్తున్నారు. వరంగల్ నగరంలోని రంగశాయిటపేట ప్రాంతానికి చెందిన రాజేష్‌కు భార్య, ముగ్గురు పిల్లలున్నట్లు తెలిసింది.

సిరా చుక్క

ఎన్నికలంటే ఠక్కున గుర్తొచ్చేది సిరా చుక్క. ఎన్నికల్లో ఓటరు తన ఓటు హక్కు వినియోగించుకున్నాక సిరా మార్కు చూపిస్తూ నేను ఓటేశానని సగర్వంగా చెప్పుకుంటాడు. ఇంకొందరు సెల్ఫీలు తీసుకొని సోషల్ మీడియాలోనూ అప్‌లోడ్ చేస్తారు. ఎన్నికల్లో వాడే సిరా మార్కు మనం తుడిచినా పోదు. ఒక్కసారి సిరా గుర్తు వేలిపై పెడితే 72 గంటల వరకు చెరిగిపోదు. మరోసారి బోగస్ ఓట్లు (దొంగ ఓట్లు) వేయకుండా ఎన్నికల సంఘం దీన్ని ప్రవేశపెట్టింది. ఈ సిరా ఇంకును కర్నాటక రాష్ట్రంలోని మైసూరుకు చెందిన మైసూర్ పెయింట్స్ అండ్ వార్నిష్ కంపెనీ తయారు చేస్తుంది. కేంద్ర ప్రభుత్వం 1962లో సిరా ఉత్పత్తి కోసం ఈ కంపెనీకి అనుమతిచ్చింది. నేషనల్ ఫిజికల్ ల్యాబొరేటరీస్ ఫార్ములాతో సిరా ఉత్పత్తి బాధ్యతను ఈ కంపెనీకి అప్పగించారు. ఈ ఫ్యాక్టరీని మైసూర్ మహారాజు కృష్ణరాజ వడయార్-4 1937లో స్థాపించారు. ఈ ఫ్యాక్టరీలో తయారయ్యే ఇంకును దేశవ్యాప్తంగా జరిగే ఎన్నికల్లో ఉపయోగిస్తున్నారు. ఈ సిరాలో 7.25 శాతం సిల్వర్ నైట్రేట్ ఉన్నందువల్ల వేసిన వెంటనే చెరిగిపోదు. సిరా గుర్తుపై ఎన్నికల సంఘం కొన్ని నిబంధనలను కూడా విధించింది. 37 (1) నిబంధన ప్రకారం ఓటరు ఎడమ చేతి వేలుపై సిరా గుర్తును చూడాల్సిన బాధ్యత పోలింగ్ అధికారికి ఉంటుంది. 2006 ఫిబ్రవరి 1 నుంచి ఓటరు ఎడమ చేతి చూపుడు వేలు గోరు పైభాగం నుంచి కింది వరకు సిరా గుర్తు వేస్తున్నారు. అంతకన్నా ముందు గోరుపై భాగం వరకు వేసేవారు.

- హనుమకొండ (ఆంధ్రజ్యోతి)

'గుర్తు' గుర్తుంచుకో..

- ఎన్నికల్లో గుర్తుకు ప్రాధాన్యత

ఎన్నికల్లో గుర్తులకు ఎంతో ప్రాధాన్యత ఉంది. అసలు గుర్తులు లేకుండా ఎన్నికలే లేవు. కాంగ్రెస్ పార్టీ అంటే హస్తం. భారతీయ జనతా పార్టీ అంటే కమలం. బీఆర్ఎస్ పార్టీ అంటే కారు, సమాజ్‌వాది పార్టీ అంటే సైకిల్. బహుజన సమాజ్ పార్టీ అంటే ఏనుగు గుర్తులు గుర్తొస్తాయి గ్రామీణ ప్రాంతాల ప్రజలు, ముఖ్యంగా చదువురాని వారు తాము ఓటేయాలనుకునే అభ్యర్థి పేరు గుర్తుకురాకపోయినా, గుర్తును బట్టి గుడ్డిగా ఓటు వేస్తారు. ఇలా పార్టీకి, ఎన్నికల గుర్తుకు విడదీయరాని బంధం పెనవేసుకుపోయింది. పార్టీలు చీలిపోయిన సందర్భాల్లో ఇంతటి ప్రాధాన్యత గల ఎన్నికల గుర్తులను కోల్పోయేందుకు ఏ వర్గమూ ఇష్టపడదు. అందుకనే ఎన్నికల కమిషన్ ముందు, లేదా న్యాయస్థానాల ఎదుట ఈ వర్గాలు గుర్తుల కోసం పోరాటం చేస్తాయి. సహజంగానే మెజారిటీవర్గం ఏ వర్గంవైపు ఉందో ఆ వర్గానికే ఎన్నికల కమిషన్ ఎన్నికల గుర్తును కేటాయిస్తుంది. బలాబలాలను స్పష్టంగా తేల్చలేని సందిగ్ధ సమయాల్లో పార్టీ గుర్తును పక్కనపెట్టి జాబితాలో ఏపార్టీకి కేటాయించని గుర్తును కేటాయిస్తుంది.

- హనుమకొండ (ఆంధ్రజ్యోతి)

ఓరుగల్లులో విద్యాదాతలు

- విద్యాభివృద్ధికి తొలితరం ఎంపీలు

బాకర్ అలీ మీర్జా, ఇటికాల, ఎస్‌బి గిరి కృషి

హనుమకొండ, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): వరంగల్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం నెరిపిన బాకర్ అలీ మీర్జా గురించి చాలా మందికి తెలియదు. 1962 ఎన్నికల్లో వరంగల్ లోక్‌సభ స్థానం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేశారు. సమీప ప్రత్యర్థి ఎస్.రామనాథంపై కేవలం 736 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. ఈయన 1967 ఎన్నికల్లో సికింద్రాబాద్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి కూడా గెలిచారు. నిజాం వారసుల్లో ఒకరు బాకర్ అలీ. అత్యున్నత విద్యావంతుడు. మద్రాస్ క్రిస్టియన్ కాలేజీ నుంచి బీఏ, అలాగే ఆక్స్‌ఫర్డ్‌లోని సెయింట్ కేథరీన్ కళాశాల నుంచి బీఏ (ఆనర్స్) చేశాడు. తర్వాత కొలంబియాకు వెళ్లి అక్కడ ఎంఏ పూర్తి చేశాడు. 1940లో ఫ్రాంక్‌ఫర్ట్‌లో పీహెచ్‌డీ పట్టా పొందారు. హైదరాబాద్ ప్రభుత్వంలో ఫారెస్ట్ అసిస్టెంట్ కన్జర్వేటర్‌గా పని చేశాడు. 1929లో అఖిల భారత కాంగ్రెస్ కమిటీ కార్మిక విభాగంలో చేరాడు. అప్పటినుంచి భారత మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూకు అత్యంత సన్నిహితుల్లో ఒకరుగా మారారు. 1962 ఎన్నికల్లో వరంగల్ లోక్‌సభ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా బకర్ అలీ మీర్జా పేరును నెహ్రూ సిఫార్సు చేశారు. అయితే ఆయనను గెలిపించే బాధ్యతను 1962 ఎన్నికల్లో మహబూబాబాద్ లోక్‌సభ స్థానం నుంచి పోటీలో నిలిచిన ఇటికాల మధుసూదన్‌రావు నెహ్రూ అప్పగించారు. ఇటికాలకు నెహ్రూతో సన్నిహిత సంబంధాలు ఉండడంతో ఆయన ఆదేశాలను కాదనలేకపోయారు.



ఇటికాల మధుసూదనరావు | బాకర్ అలీ మీర్జా | ఎస్‌బి గిరి

మధుసూదన్‌రావు మహబూబాబాద్ నుంచి విజయం సాధించడమే కాకుండా వరంగల్ నుంచి మీర్జా గెలుపొందడానికి కూడా తోడ్పడ్డాడు. ఆ తర్వాత నెహ్రూ సూచన మేరకు వరంగల్ లోక్‌సభ నియోజకవర్గం అభివృద్ధి బాధ్యతను కూడా మీర్జా పక్షాన మధుసూదన్‌రావు తీసుకున్నారు. వరంగల్‌లో ప్రాంతీయ ఇంజనీరింగ్ కళాశాల, కాకతీయ వైద్య కళాశాల స్థాపనలో ఆయన కృషి ఉంది.

ఇటికాల మధుసూదన్ రావు

ఇటికాల మధుసూదన్‌రావు ఆదర్శ ఎంపీ. వరంగల్ జిల్లాలో విద్యారంగం అభివృద్ధికి బాటలు వేసింది ఆయనే. తొలి తరం ఎంపీల్లో ఆయన ఒకరు. 1957, 1962 ఎన్నికల్లో మహబూబాబాద్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి రెండు సార్లు గెలిచారు. 1957 ఎన్నికల్లో పీడీఎఫ్ అభ్యర్థి ఎస్.రామనాథంపై 1962 ఎన్నికల్లో సీపీఐ అభ్యర్థి టీఎస్ రావుపై గెలుపొందారు. మధుసూదన్‌రావు జీవితం అంతా పోరాటాలతోనే గడిచింది. 1938లో మొదటి సత్యాగ్రాహిగా జైలు శిక్ష అనుభవించారు. 1942లో క్విట్ ఇండియా ఉద్యమంలో వ్యక్తిగత సత్యాగ్రహంలో పాల్గొని అరెస్టయ్యారు. 1947లో రజాకార్ల దౌర్జన్యాలకు వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో పాల్గొని కఠిన కారాగార శిక్ష అనుభవించాడు. విద్యతోనే అభివృద్ధి సాధ్యమని నమ్మిన మధుసూదన్‌రావు.. ఆ దిశగా ఎంతో కృషి చేశారు. కేంద్రంతో పోరాడి తిరుపతికి వెళ్లాల్సిన ప్రాంతీయ ఇంజనీరింగ్ కాలేజీని (ప్రస్తుతం వరంగల్ నిట్) వరంగల్‌లో నెలకొల్పేలా చేశాడు. ప్రధాని నెహ్రూను వరంగల్‌కు రప్పించి ఆయన చేతుల మీదుగా ప్రారంభింప చేశాడు. కాకతీయ మెడికల్ కాలేజీ ఏర్పాటుకు, శ్రీరాంసాగర్ ప్రాజెక్టు సాధనలో కీలకపాత్ర పోషించారు. వరంగల్‌లోని పలు ఇతర అభివృద్ధి పనుల్లో ఆయన కృషి ఉంది. 46 ఏళ్ల వయసులోనే 1964లో కన్నుమూశారు. దీనితో 1965లో వచ్చిన ఉప ఎన్నికల్లో మహబూబాబాద్ లోకసభ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా రామసహాయం సురేందర్ రెడ్డి పోటీ చేసి తొలిసారి పార్లమెంట్‌లో అడుగుపెట్టారు.

ఎస్‌బీ గిరి

1971, 1977 ఎన్నికల్లో వరుసగా రెండు సార్లు వరంగల్ లోకసభ నియోజకవర్గం నుంచి గెలుపొందిన ఎస్‌బీ గిరి తెలంగాణ ఉద్యమకారుడు, కార్మిక నాయకుడు. తెలంగాణ తొలి ఉద్యమంలో కీలక పాత్ర పోషించారు. తెలంగాణ ప్రజాసమితి (టీపీఎస్) పక్షాన 1971లో పోటీ చేసి కాంగ్రెస్ అభ్యర్థి కేఎస్ రెడ్డిపై గెలుపొందారు. 1977 ఎన్నికల్లో ఇదే నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో నిలిచి బీఎల్‌డీ అభ్యర్థి సి.జంగారెడ్డిపై విజయం సాధించారు. తెలంగాణ ఉద్యమం సందర్భంగా పీడీ చట్టం కింద నిర్బంధానికి గురయ్యారు. నిజాం షుగర్ ఫ్యాక్టరీ (బోధన్) యూనియన్ అధ్యక్షుడిగా దక్షిణ మధ్య రైల్వే మంజ్దూర్ యూనియన్, ఐడీఎల్ కెమికల్ లిమిటెడ్, హెచ్ఎఎలక్ట్ ఫ్యాక్టరీ కార్మిక సంఘం అధ్యక్షుడిగా పని చేశారు. ఆజంజాహి మిల్లు కార్మికుల సంక్షేమానికి విశేషంగా కృషి చేశారు.

మోదీతోనే అభివృద్ధి సాధ్యం


బీజేపీలో చేరుతున్న వారికి కండువా కప్పుతున్న వరంగల్ ఎంపీ అభ్యర్థి అరూరి రమేష్

- బీజేపీ ఎంపీ అభ్యర్థి అరూరి రమేష్

తొర్రూరు, ఏప్రిల్ 28 : భారత దేశం అన్ని విధాలుగా అభివృద్ధి చెందేందుకు మోదీతోనే సాధ్యమవుతుందని, మరోమారు మోడీని ప్రధానమంత్రి చేసేందుకు దేశ ప్రజలు ఉత్సాహంగా ఉన్నారని మాజీ ఎమ్మెల్యే, వరంగల్ బీజేపీ పార్లమెంట్ అభ్యర్థి ఆరూరి రమేష్ అన్నారు. ఆదివారం తొర్రూరుకు చెందిన 200మంది కాంగ్రెస్ పార్టీ ముఖ్యనాయకులు, కార్యకర్తలు హనుమకొండలో ఆరూరి రమేష్ ఆధ్వర్యంలో బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాలకుర్తి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీలో ఉన్న కార్యకర్తలకు కనీస గుర్తింపు లేదన్నారు. ఎన్నికల ముందు కార్యకర్తలను కాపాడుకుంటానని తెలిపి ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత పార్టీలో కష్టపడి పనిచేసిన వారిని గుర్తించకుండా కండువాలు కప్పేందుకు ప్రాధాన్యత ఇస్తున్నారని, దీంతో ఎంతో మంది కార్యకర్తలు నిరాశతో ఉన్నారన్నారు. తొర్రూరు పట్టణానికి చెందిన పార్టీ సీనియర్ నాయకులు సాయిముఖేష్, సారయ్య, మెండిస్‌తో పాటు సుమారు 200 మంది కార్యకర్తలు బీజేపీలో చేరారు. ఇంటింటికి వెళ్లి మోదీ చేసిన అభివృద్ధి పథకాలను తెలియజేస్తూ ఆరూరి రమేష్ గెలుపుకోసం కృషి చేస్తామన్నారు. బీజేపీ తొర్రూరు అర్బన్ అధ్యక్షుడు అలిసేరి రవిబాబు, కొలుపుల శంకర్ ఉన్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు మద్దతు

- ఇండియా కూటమిని గెలిపించుకోవాలి
- విభజన హామీల అమలులో బీజేపీ, బీఆర్ఎస్ విఫలం
- సీపీఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాస్

మహబూబాబాద్ టౌన్, మే28 : పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని నిలువరించేందుకు కాంగ్రెస్‌కు సంపూర్ణ మద్దతు నిస్తున్నట్లు సీపీఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్ తెలిపారు. ప్రజాస్వామ్య, రాజ్యాంగ పరిరక్షణ, సెక్యులరిజాన్ని కాపాడుకోవడానికి మతోన్మాద బీజేపీని ఓడించడమే లక్ష్యంగా పని చేయాలని నిర్ణయించినట్లు పిలుపునిచ్చారు. మహబూబాబాద్ పెరుమాండ్ల జగన్నాథం భవన్‌లో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని సీపీఎం రాష్ట్ర నాయకత్వం కలిసిన సమయంలో కాంగ్రెస్‌కు మద్దతు ఇవ్వాలని సీఎం కోరినట్లు



సమావేశంలో మాట్లాడుతున్న సాదుల శ్రీనివాస్

చెప్పారు. అఖిల భారతస్థాయిలో జరిగే పార్లమెంట్ ఎన్నికలకు ప్రత్యేక ప్రాధాన్యత ఉందని దేశాన్ని మత రాజ్యాంగ మార్పే బీజేపీ కుట్రలను తిప్పి కొట్టాల్సిన అవసరం ఉందన్నారు. దేశవ్యాప్తంగా లౌకికశక్తులన్నీ కలిసి ఇండియా కూటమిగా ఏర్పడ్డాయని పార్లమెంట్ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపించాలన్నారు. అందులో భాగంగా మానుకోట పార్లమెంట్ నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి బలరాం నాయక్‌కు తమ సంపూర్ణ మద్దతును ప్రకటించామని, ఆయన గెలుపు కోసం సీపీఎం పని చేస్తుందని స్పష్టం చేశారు.

బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ సాధనలో..

రాష్ట్ర విభజన హామీల అమలులో బీజేపీ, బీఆర్ఎస్ విఫలమయ్యాయని సాదుల శ్రీనివాస్ విమర్శించారు. మహబూబాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గ పరిధిలోని బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ స్థాపనలో ఆ రెండు పార్టీలు పూర్తిగా వైఫల్యం చెందాయని దుయ్యబట్టారు. గత పాలకుల నిర్లక్ష్యం వల్ల తాగు, సాగునీరు సమస్య తలెత్తుతుందని, దానిని పరిష్కరించాలన్నారు. మానుకోటలో కాంగ్రెస్ అభ్యర్థి బలరాంనాయక్ గెలుపును కోరుతూ మే 5న సీపీఎం ఆధ్వర్యంలో పార్లమెంటరీ నియోజకవర్గ స్థాయి సమావేశాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆకుల రాజు, గునిగంటి రాజన్న, అల్వాల వీరయ్య పాల్గొన్నారు.


కొత్తగూడలో బీజేపీలో చేరుతున్న వారికి కండువాలు కప్పుతున్న బీజేపీ నాయకులు

బీజేపీ నుంచి బీఆర్ఎస్‌లో చేరిక

దంతాలపల్లి, ఏప్రిల్ 28 : మండలంలోని దాట్ల గ్రామ బీజేపీ అధ్యక్షుడు కొండ బుచ్చయ్య ఆదివారం మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్ సమక్షంలో బీఆర్ఎస్ తీర్థం పుచుకున్నారు. ఈ సందర్భంగా రెడ్యానాయక్ మాట్లాడుతూ రానున్న రోజుల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు ఓటువేయరన్నారు. మహబూబాబాద్ ఎంపీగా మాలోతు కవిత భారీ మెజార్టీతో గెలవడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు ధర్మారపు వేణు, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

- కొత్తగూడ : మండలంలోని పెగడపల్లి గ్రామానికి చెందిన దీకొండ రవి, గుంజేడు గ్రామానికి చెందిన గంద్ర కోటి నవీన్‌యాదవ్ కొత్తగూడలో బీజేపీ రాష్ట్ర నాయకుడు బోడ నవీన్‌నాయక్, జిల్లా కమిటీ సభ్యుడు జాడి సారయ్య సమక్షంలో బీజేపీలో చేరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు గుగులోత్ రూప్లా, నరేష్, సిరబోయిన యాకయ్య, కుమార్ పాల్గొన్నారు.

నేడు కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ ఎన్నికల సమావేశం

- హాజరు కానున్నా ఇన్‌చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు

దుగ్గొండి (వరంగల్ జిల్లా), ఏప్రిల్ 28 : మండలంలోని గిర్నిబావిలో సోమవారం మహబూబాబాద్ పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశం జరుగుతుందని ఇన్‌చార్జి మంత్రితో పాటు పార్లమెంట్ అభ్యర్థి పోరిక బలరాం నాయక్, ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డిలు హాజరవుతారని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎర్రెల బాబు ఆదివారం వెల్లడించారు. ప్రతీ గ్రామం నుంచి గ్రామ అధ్యక్షులు, అనుబంధ సంఘాల బాధ్యులు, మహిళలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని కోరారు.

'ప్రతీ వాహనాన్ని పరిశీలించాలి'

పర్వతగిరి, ఏప్రిల్ 28 : ఎన్నికల వేళ ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని ఎన్నికలవ్యయ పరిశీలకుడు ధీరజ్ సింఘా అన్నారు. ఆదివారం మండలంలోని చింత నెక్కొండ క్రాస్‌రోడ్ వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును సందర్శించి స్టాటిక్ సర్వేలెన్స్ టీం నిర్వహణను, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అప్రమత్తతతో చెక్ పోస్టుల వద్ద విధులను నిర్వర్తించాలని, ప్రలోభాలకు గురిచేసే చర్యలను అరికట్టేందుకు నిత్యం నిఘా ఉంచాలని, అక్రమమద్యం, నగదు సరఫరా కాకుండా పటిష్టంగా నిఘా పెట్టాలన్నారు. కార్యక్రమంలో సహాయ వ్యయ అధికారి నాగ నారాయణ, ఎల్‌ఓ నయీమ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చింది కాంగ్రెస్సే


కాంగ్రెస్‌లో చేరుతున్న వారికి పార్టీ కండువాలు కప్పుతున్న డీసీసీ జనరల్ సెక్రటరీ రూప్‌సింగ్

- ఎంపీగా బలరాంనాయక్‌ను గెలిపించాలి
- టీపీసీసీ ఆర్గనైజింగ్ సెక్రటరీ నారాయణ రెడ్డి

కొత్తగూడ, ఏప్రిల్ 28 : దేశానికి స్వాతంత్ర్యం తెచ్చింది కాంగ్రెస్ తెలంగాణ రాష్ట్రం ఇచ్చింది కాంగ్రెస్ పార్టీ అని, బలరాంనాయక్‌ను భారీ మెజారిటీతో గెలిపించి సోనియాగాంధీకి కానుకగా ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వజ్జ సారయ్య టీపీసీసీ ఆర్గనైజింగ్ సెక్రటరీ చల్లా నారాయణరెడ్డి పిలుపునిచ్చారు. మంత్రి సీతక్క ఆదేశాల మేరకు మండలంలోని ఎదుళ్లపల్లిలో కాంగ్రెస్ పార్టీ క్లస్టర్ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర మంత్రిగాపనిచేసినప్పుడు బలరాంనాయక్ ఎన్నో అభివృద్ధి పనులను చేయించాడని పేర్కొన్నారు. జాతీయ రహదారులు, పలు గురుకుల పాఠశాలలు, భారీ వంతెనలు తీసుకువచ్చాడని పేర్కొన్నారు. సోనియా గాంధీ తెలంగాణ రాష్ట్రంను ప్రకటించే విషయంలో బలరాంనాయక్ కీలకపాత్ర పోషించాడని పేర్కొన్నారు. ఎంపీ కవితకు ఆమే తండ్రి రెడ్యానాయక్‌కు రాజకీయ జీవితం ఇచ్చింది కాంగ్రెస్ పార్టీ అని పేర్కొన్నారు. రాహుల్‌గాంధీ ప్రధాన మంత్రి కావడం ఖాయమని బలరాంనాయక్ మంత్రి పదవిపొంది అభివృద్ధికి నిధులు తీసుకురావడం ఖాయమని పేర్కొన్నారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు, పార్టీ ఎన్నికల ఇన్‌చార్జి లావాణ వెంకన్న, వైస్ ఎంపీపీ కాడబోయిన జంపయ్య, జిల్లా యూత్ ప్రధాన కార్యదర్శి నోముల ప్రశాంత్‌యాదవ్, సర్పంచ్ ఇర్ప రాజేశ్వర్, నాయకులు పులుసం వెంకన్న, వెంకన్న, రమేష్, శైలజ కుమార్‌కార్యకర్తలు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరిక

మండలంలోని ఓటాయి గ్రామంలో బీఆర్ఎస్ పార్టీకి చెందిన నాయకులు బుగ్గల ఉప్పలయ్య, రాధరాపు వీరాస్వామి, చింత రాజు డీసీసీ జనరల్ సెక్రటరీ బానోత్ రూప్‌సింగ్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు, కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామకమిటీ అధ్యక్షుడు పెండ్యాల సారంగపాణి, కోటిలింగం, కట్టమల్లు, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

టీజేఎస్ జిల్లా అధ్యక్షుడు డోలికి మాతృ వియోగం


డోలి ఎల్లమ్మ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న కేంద్ర మాజీ మంత్రి పోరిక బలరాంనాయక్

మహబూబాబాద్ టౌన్, ఏప్రిల్ 28 : తెలంగాణ జన సమితి (టీజేఎస్)జిల్లా అధ్యక్షుడు, మహబూబాబాద్ నలంద విద్యాసంస్థల కరస్పాండెంట్ డాక్టర్ డోలి సత్యనారాయణ, మాజీ మునిసిపల్ కౌన్సిలర్ డోలి లింగుబాబు తల్లి ఎల్లమ్మ (87) అనారోగ్యంతో ఆదివారం తెల్లవారుజామున కన్నుమూశారు. మృతురాలికి ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు సంతానం. విషయం తెలుసుకున్న వివిధ పార్టీలు, ప్రజాసంఘాల నేతలు, మానుకోట ఎంపీ మాలోతు కవిత, కేంద్ర మాజీమంత్రి పోరిక బలరాంనాయక్, మాజీ ఎంపీ అజ్మీరా సీతారాంనాయక్, ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్, డీసీసీ అధ్యక్షుడు జెన్నారెడ్డి భరత్‌చందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్, మునిసిపల్ చైర్మన్ పాల్వాయి రాంమోహన్‌రెడ్డి, వైస్‌చైర్మన్ మార్నేని వెంకన్న, పర్కాల శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్డీ. ఫరీద్, యాళ్ల మురళీధర్‌రెడ్డి, ముత్యం వెంకన్న, జడ్పీ కో-ఆప్షన్ సభ్యులు షేక్. మహబూబ్‌పాషా, మునిసిపల్ ఫ్లోర్‌లీడర్ చిట్యాల జనార్ధన్, యాప సీతయ్య, బోయినపల్లి లక్ష్మణ్‌రావు, ఘనపురపు అంజయ్య, సీపీఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్, మునిసిపల్ ఫ్లోర్‌లీడర్ సూర్నపు సోమయ్య అకుల రాజు, సీపీఐ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి, ఫ్లోర్ లీడర్ అజయ్‌సారథి రెడ్డి, న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు మండల వెంకన్న,బీఎస్పీ నేతలు కోనేటి సుజాత, దార్ల శివరాజ్, టీఎంఎం రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్, టీపీటీఎఫ్ రాష్ట్ర మాజీ కార్యదర్శి ఖైస శ్రీనివాస్ తదితరులు మానుకోటలో డోలి ఎల్లమ్మ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఆపై ఆమె కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.

వరంగల్ డీఈవోను సస్పెండ్ చేయాలి

నెహ్రూసెంటర్, ఏప్రిల్ 28 : కిందిస్థాయి ఉద్యోగి డ్రైవర్‌ను అకారణంగా దుర్భాషలాడుతూ కులం పేరుతో దూషించిన వరంగల్ డీఈవోను తక్షణమే విధుల నుంచి సస్పెండ్ చేయాలని తెలంగాణ గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి గంగావత్ శ్రీనివాస్‌నాయక్ ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. తన ఫోన్ లిఫ్ట్ చేయలేదని కిందిస్థాయి ఉద్యోగిని కులం పేరుతో దూషించడం సమజసం కాదన్నారు. ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులపై నిత్యం వేధింపులు జరుగుతున్నాయని, తక్షణమే ఇలాంటి వేధింపులను మానుకోవాలని హెచ్చరించారు.

బీఆర్ఎస్ గెలుపే లక్ష్యంగా పని చేయాలి

- మానుకోట ఎంపీ మాలోతు కవిత

మహబూబాబాద్ టౌన్, ఏప్రిల్ 28 : పార్లమెంట్‌లో తెలంగాణ అభివృద్ధి కోసం కొట్లాడే బీఆర్ఎస్‌ను గెలిపించాలని మానుకోట ఎంపీ అభ్యర్థి మాలోతు కవిత పిలుపునిచ్చారు. మహబూబాబాద్ పట్టణంలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో ఆదివారం మానుకోట అర్బన్, రూరల్ మండలాల కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మే 1న సాయంత్రం 6 గంటలకు జరిగే మాజీ సీఎం కేసీఆర్ రోడ్‌షోను జయప్రదం చేయాలన్నారు. ఎమ్మెల్సీ సత్యవతిరాథోడ్, మాజీఎమ్మెల్యే శంకర్‌నాయక్, మునిసిపల్ చైర్మన్ రాంమోహన్‌రెడ్డి, వైస్ చైర్మన్ మార్నేని వెంకన్న, జడ్పీటీసీ లూనావత్ ప్రియాంక, పర్కాల శ్రీనివాస్‌రెడ్డి, గద్దె రవి, కేఎస్ఎన్. రెడ్డి, యాళ్ల మురళీధర్‌రెడ్డి, కుడితి మహేందర్‌రెడ్డి, ఎమ్డీ. ఫరీద్, తేళ్ల శ్రీనివాస్, ముత్యం వెంకన్న, షేక్, మహబూబ్‌పాషా, ఆవుల వెంకన్న, బోడ లక్ష్మన్, డౌలాగర్ శంకర్, బూర్ల ప్రభాకర్ పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి ఆదరించాలి..

గూడూరు : గత పదేళ్లుగా బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి చూసి తమకు ఓట్లువేసి గెలిపించాలని మహబూబాబాద్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థికవిత అన్నారు. గూడూరులో బీఆర్ఎస్ మండలస్థాయి విస్తృత సమావేశం నిర్వహించారు. మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతిరాథోడ్, మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్, నాయకులు భరత్‌కుమార్‌రెడ్డి, మద్రి రంగారావు, వెంకటకృష్ణారెడ్డి, బానోత్ నర్సింహానాయక్, ఆరె వీరన్న, నూకల సురేందర్, బోడ కిషన్, కటార్‌సింగ్, మన్మోహన్‌రెడ్డి, రామన్ననాయక్, రహీం, సోము, వెంకన్న పాల్గొన్నారు.

సంతాన సాఫల్య చికిత్సపై అవగాహన

మహబూబాబాద్ టౌన్, ఏప్రిల్ 28 : పట్టణంలోని వేంకటేశ్వర నర్సింగ్‌హోంలో వైద్యుడు అర్జున్‌రెడ్డి నేతృత్వంలో ఒయాసిస్ ఫర్టిలిటీ వరంగల్ వారి ఆధ్వర్యంలో ఆదివారం సంతాన సాఫల్య చికిత్సపై అవగాహన కల్పించారు. క్లినికల్ హెడ్ అండ్ ఫర్టిలిటీ స్పెషలిస్టు డాక్టర్ జలగం కావ్యరావు సంతాన సాఫల్య చికిత్సపై సంపూర్ణ అవగాహన కల్పించారు. సంతానలేమితో బాధపడు తున్న 80మంది దంపతులకు పైగా ఉచితంగా పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ కావ్యరావు మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాలుగా జిల్లానుంచి 350మంది జంటలకు పైగా ఫర్టిలిటీ నందు చికిత్స నందించి 70 శాతంకు పైగా చికిత్స ద్వారా సంతానలేమి నుంచి విముక్తి కల్పించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అర్జున్‌రెడ్డి, డాక్టర్ బానోత్ నెహ్రూరాథోడ్, డాక్టర్ శిరీష పాల్గొన్నారు.

ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- విద్యుత్ సూపరిండెంట్ ఇంజనీర్ నరేష్


కురవి ఏకలవ్య మోడల్ గురుకులంలో విద్యుత్ ప్రమాద నివారణ సదస్సులో మాట్లాడుతున్న సూపరిండెంట్ ఇంజనీర్ నరేష్

కురవి, ఏప్రిల్ 28 : విద్యుత్ ప్రమాదాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మహబూబాబాద్ సూపరిండెంట్ ఇంజనీర్ జె.నరేష్ అన్నారు. కురవిలోని ఏకలవ్య మోడల్ గురుకులంలో విద్యుత్ ఉద్యోగుల ఆధ్వర్యంలో విద్యుత్ ప్రమాద నివారణ సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యుత్ ప్రమాదాలకు గల కారణాలను వివరిస్తూ ప్రమాదాలు జరుగకుండ తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచించారు. విద్యార్థులకు ప్రజంటేషన్ రూపంలో వివరించారు. తోటి వారికి విద్యుత్ ప్రమాదాలపై అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ సంతోష్, వైస్ ప్రిన్సిపల్ శోభారాణి, డీఈలు శ్రీకాంత్, విజయ్, ఏడీఈ రమేష్, ఏఈ శారద, సబ్‌ఇంజనీర్ రఫీయోద్దీన్, ఎస్ఎల్ఐ కేదారి, లైన్ ఇన్‌స్పెక్టర్ జంపిరావు పాల్గొన్నారు.

కఠమహేశ్వరుడి అలయానికి రూ.లక్ష 16 వేల విరాళం

చిన్నగూడూరు, ఏప్రిల్ 28 : గుండంరాజుపల్లిలో నూతనంగా నిర్మించిన కంఠమహేశ్వరుడి అలయ అభివృద్ధికి కిసాన్ పరివార్ వ్యవస్థాపకుడు భూపాల్ నాయక్ రూ. లక్షా 16 వేల చెక్కును విరాళంగా గ్రామ కంఠమహేశ్వర కమిటీ సభ్యులకు అందజేశారు. అనంతరం కంఠమహేశ్వర అలయంలో పూజలు నిర్వహించారు. ఆయనను పూలమాలతో గౌడ కులస్తులు సత్కరించి, ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో దొంతు నవీన్, సృజన్, శంకర్, రామన్న, వెంకన్న, కృష్ణ తదితరులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంతో వ్యక్తి మృతి

మరిపెడ, ఏప్రిల్ 28 : రోడ్డు ప్రమాదంతో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన ఆదివారం రాత్రి నేతవత్‌తండా-బక్కరూప్లాతండా సమీపంలో 563 జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం. నర్సింహులపేట మండలం జయపురం గ్రామానికి చెందిన గంగుల సతీశ్ (32) టైల్స్ కార్మికుడిగా పని చేస్తున్నారు. ఆదివారం పనులు ముగించుకొని మరిపెడ బంగ్లా నుంచి తనబైక్‌పై జయపురం వెళుతుండగా వరంగల్ వైపు నుంచి ఖమ్మం వెళుతున్న లారీ ఓవర్ టెక్‌చేసి ఢీ కొంది. దీంతో సతీశ్ అక్కడికి అక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, తల్లితండ్రులు ఉన్నా రు. మరిపెడ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తహెర్‌బాబా తెలిపారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం


నర్సింహులపేటలో సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

నర్సింహులపేట, ఏప్రిల్ 28 : నర్సింహులపేట హైస్కూల్లో 1984-85 పదవ తరగతి విద్యాభ్యాసం చేసిన పూర్వ విద్యార్థులు ఆదివారం అపూర్వ సమ్మేళనానికి మండలం కేంద్రంలోని శ్రీలక్ష్మీ తిరుపతమ్మ ఆలయం వేదిక అయింది. అక్కడ ఏర్పాటు చేసిన సమావేశంలో అప్పటి ఆచార్యులుస్వామి, దక్షిణామూర్తితో పాటు పలువురు ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. బాల్యంనాటి గుర్తులను నెమరు వేసుకుంటూ సంతోషంలో మునిగిపోయారు. అనంతరం వివిధ కారణాలతో మృతి చెందిన మిత్రులకు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నిర్వహణ కమిటీ సభ్యులు గడ్డి యాకయ్య, బీఎస్.రాజు, కె.రుద్ర, కె.శ్రీనివాస్‌రెడ్డి, పోషాల శ్రీను, డి.వెంకటేశ్వర్లు, రంగారెడ్డి, మల్లారెడ్డి, శ్రీనివాస్‌మూర్తి, యామిని, లత, సంధ్య, కల్యాణి, రోజా, గండి సతీష్, నరహరి పాల్గొన్నారు

హామీలు మరిచి ప్రజలను మోసగించిన కాంగ్రెస్

- డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే డీఎస్.రెడ్యానాయక్

డోర్నకల్, ఏప్రిల్ 28 : అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించి కాంగ్రెస్ పార్టీ ప్రజలను మోసం చేసిందని డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే డీఎస్.రెడ్యానాయక్ అన్నారు. ఆదివారం బంజర, అమ్మపాలెం, డోర్నకల్ మునిసిపాలిటీ పరిధిలో ఆదివారం ఎంపీ అభ్యర్థి మాలోతు కవిత గెలుపు కోసం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమలుకు నోచుకోని హామీలను ఇచ్చి మాయ మాటలతో ప్రజలను మభ్యపెట్టి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందన్నారు. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రజా సమస్యలను పక్కన పెట్టి ప్రతిపక్ష పార్టీలపై ప్రతికార ధోరణితో వ్యవహరిస్తుందని ఆరోపించారు. ప్రజలు ఇప్పటికైన కాంగ్రెస్ పార్టీ మాటలు నమ్మొద్దని, వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి మాలోతు కవితను అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ అధ్యక్షులు నున్న రమణ, మహబూబాబాద్ ఏఎంసీ మాజీ చైర్మన్ కత్తెరసాల విద్యాసాగర్, బాలునాయక్, కౌన్సిలర్లు బోరగళ్ల శరత్‌బాబు, కొండేటి హేమచంద్రశేఖర్, కొత్త రాధిక, తేజావత్ సంధ్యారాణి, పోటు జనార్ధన్, కాల మౌనికజైన్, నాయకులు అజీత్‌మియా, మారబోయిన రాంభద్రం, సోనిక్‌ఖాదర్, గౌస్‌పాషా పాల్గొన్నారు.

కోరిన కోరికలు తీర్చే నాగేంద్రస్వామి

- వైభవోపేతంగా 23వ వార్షికోత్సవం


ఆనేపురంలో నాగేంద్రస్వామి పూజలను నిర్వహిస్తున్న పూజారులు

మరిపెడ రూరల్, ఏప్రిల్ 28 : మండలంలోని ఆనేపురంలో బహుళ పంచమి రోజు ఆదివారం నాగేంద్ర స్వామి ఆలయం 23వ వార్షికోత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. ఆలయ పూజారులు యాకాంబ్రచార్యులు, నితిన్చార్యులు ఆధ్వర్యంలో ప్రభాత సేవ, అభిషేకం, గణపతి పూజ, పుణ్యాహవచనం, రిత్వికరణ, యాగశాల ప్రవేశం, నవగ్రహ,మూలమంత్రహవనం, పూర్ణాహుతిని నిర్వహించారు. సాయంత్రం దేవాలయం చుట్టూ బండ్లు తిరిగాయి. అనంతరం స్వామివారి ఏకాంతర సేవ కార్యక్రమాలు నిర్వహించారు. హాజరైన భక్తులు తాము కోరిన కోరికలను నాగేంద్ర స్వామి తీర్చుతారన్నారు.

ప్లాస్టిక్ నిర్మూలన.. మూణ్ణాళ్ల ముచ్చటేనా!?



మరిపెడ రూరల్, ఏప్రిల్ 28 : ప్లాస్టిక్ కవర్లు ఉపయోగిస్తే పాతాళలోకానికేనని, ప్లాస్టిక్ కవర్లను తగల పెట్టినా, అవి పూర్తిగా నాశనం కావు. కొన్ని మిలియన్ సంవత్సరాలైనా అవి పూర్తిగా దగ్ధం కావు. దీంతో పర్యావరణానికి ముప్పు జరుగుతోంది. అందుకే గత ప్రభుత్వం రెండేళ్ల క్రితం ప్లాస్టిక్ కవర్లను నిర్మూలించింది. గత రెండేళ్ల క్రితం మహబూబాబాద్ జిల్లాలోనే అన్నీ మునిసిపాలిటీ కేంద్రాలతోపాటు మండల కేంద్రాల్లోని వ్యాపారులకు, వినియోగదారులందరికీ తగిన సూచనలు ఇచ్చింది. తద్వారా భవిష్యత్ తరాలకు కలిగే ఉపద్రవాలను అధికారులు ప్రజలకు వివరించారు. ప్లాస్టిక్‌ను వాడడం ముప్పు.. గుడ్డ (కాటన్ కవర్ల) సంచులను వాడడమే కరెక్ట్ అని నినాదాలను రాయించారు. వినియోగదారులందరూ పర్యావరణానికి సురక్షితమైన కాటన్ కవర్లను వినియోగించాలని సూచించారు. వ్యాపారులకు కూడా తగు సూచనలు ఇచ్చారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై పెద్ద మొత్తంలో జరిమానాలు విధించిన ఘటనలు కోకొల్లలు. కొద్ది కాలం ప్లాస్టిక్ కవర్ల ఉపయోగం తగ్గిపోయింది. కానీ, మళ్లీ జిల్లాలోని అన్ని పట్టణ కేంద్రాలతోపాటు గ్రామాల్లో కూడా ప్లాస్టిక్ ఉపయోగం పెరిగిపోయింది. క్రమంగా ప్లాస్టిక్ భూతం కమ్మేస్తోంది. అయినా అధికారులలో ఉలుకూపలుకు లేదు. పన్నుల వసూళ్లపై ఉన్న శ్రద్ధ, ప్రజాహితంపై కొరవడిన వైనం కడు శోచనీయం. నామమాత్రపు హెచ్చరికలతో కాలం వెళ్లదీస్తున్నారు. ఇంకెన్నాళ్లు ఈ జాడ్యం. ఎందుకు ఈ వైపరీత్యం, ఇప్పటికైనా అధికారుల అలసత్వాన్ని వీడి పర్యావరణాన్ని కాపాడాలని ప్రజలు కొరుకుంటున్నారు.

గంగారంలో పోలింగ్ కేంద్రాల భద్రత పరిశీలన



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ తిరుపతిరావు

గంగారం, ఏప్రిల్ 28 : ఏజన్సీ ప్రాంతమైన గంగారం మండలంలోని అత్యంత ప్రతిష్ఠాత్మకమైన పోలింగ్ కేంద్రాల భద్రతను ఆదివారం మహబూబాబాద్ డీఎస్పీ తిరుపతి రావు పరిశీలించారు. రాబోయే పార్లమెంటు ఎన్నికల సందర్భంగా మావోయిస్టుల ఇలకా అయిన గంగారం మండలంలో మారుమూల గ్రామాలైన మద్రి గూడెం, కామారం, దుబ్బగూడెం, పూనుగొండ్ల, కోమట్లగూడెం, చింత గూడెం, జంగాలపల్లి, గంగారం పోలింగ్ బూతులను పరిశీలించారు. రహదారి సౌకర్యం లేని గ్రామాలకు ఎన్నికల సామగ్రి పంపించి ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పోలింగ్‌కు ముందు ఎన్నికల సిబ్బందితో పాటు ఈవీఎంల భద్రతపై కూడా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రతీ పౌరుడు వారి ఓటు హక్కును సద్వినియోగం చేసుకోనేందుకు పోలీసులు అండగా ఉండాలని కోరారు. ఓటరు ఎటువంటి ప్రలోభాలకు లొంగకుండా స్వేచ్ఛగా ఓటు వేసే వాతావరణం కల్పించాలని కోరారు. ఎన్నికలలో చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ఇందుకు గాను గ్రామస్తులు కూడా పోలీసులకు సహకరించాలని అన్నారు. గ్రామాలలో అక్రమ మద్యం, గుడుంబా, డబ్బు రవాణాకు సంబందించిన సమాచారం పోలీసులకు ఇవ్వాలని అన్నారు. గూడూరు సీఐ బాబూరావుకు గంగారం ఎస్ఐ రవికుమార్ పాల్గొన్నారు.

స్వయం ఉపాధి శిక్షణ తరగతులను

ములుగు కలెక్టరేట్, ఏప్రిల్ 28 : ములుగు జిల్లాలోని మహిళలు, యువతకు స్వయం ఉపాధిపై నిర్వహించే శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో హనుమకొండ జిల్లా హసన్‌పర్తిలో గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని తెలిపారు. ములుగు జిల్లా నుంచి శిక్షణ తరగతులకు వెళ్లేవారికి రవాణా ఖర్చు లేకుండా ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. టైలరింగ్, బ్యూటీపార్లర్, జ్యూట్‌బ్యాగ్ తయారీ, సెల్‌ఫోన్ రిపేర్, సర్వీసెస్, సీసీటీవీ ఇన్‌స్టాలేషన్, ఎలక్ట్రికల్ హౌస్‌వైరింగ్, బైక్ రిపేరింగ్, ఫొటో, వీడియోగ్రాఫ్, ప్లంబింగ్, శానిటరీ, ఏసీలు, ఫ్రిజ్ రిపేర్, సర్వీసెస్, ఎలక్ట్రికల్ మోటార్ వైండింగ్, కంప్యూటర్ హార్డ్‌వేర్, నెట్‌వర్కింగ్, టూవీలర్ మెకానిక్, మెన్స్‌పార్లర్, సెలూన్, అగర్‌బత్తి తయారీ, డైరీఫార్మింగ్, షీప్ ప్రొడక్షన్, పౌల్ట్రీ, ఫాస్ట్‌ఫుడ్ తయారీ, ఫొటో ఫ్రేమింగ్, లామినేషన్, కార్పెంటరీ, టీవీ టెక్నీషియన్ తదితర రంగాల్లో శిక్షణ ఇస్తున్నట్లు వివరించారు. 18 నుంచి 45ఏళ్ల లోపువారు చదవడం, రాయడం వచ్చి ఉండాలని, జిల్లా వాసులై ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు కలిగి ఉండాలని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్నవారు మే 10లోగా కలెక్టర్ కార్యాలయంలోని సెక్షన్ సీనియర్ అసిస్టెంట్ అనిల్‌కుమార్ సెల్ నంబర్ 9194930383కు దరఖాస్తు సమర్పించాలని సూచించారు.